ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 19 మే 2024

పాలకొండ వాసికి స్టేట్ ఫస్ట్

- కొమరాడ విదార్థినికి పదో ర్యాంకు
- టీఎస్ ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు



జ్యోతిరాదిత్య

పాలకొండ, మే 18: తెలంగాణ రాష్ట్ర ఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. పాలకొండ మండలం యరకారాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య ఇంజనీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు మోహన్‌రావు, హైమావతిలు ప్రస్తుతం శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా మోహన్‌రావు విధులు నిర్వహిస్తున్నారు. హైమావతి శ్రీకాకుళం ఆర్టీసీ డిపో పరిధిలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. జ్యోతిరాదిత్య ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు కృష్ణా జిల్లా గుడివాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్నాడు. పదో తరగతి ఫలితాల్లో 556 మార్కులు సాధించాడు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ఇంటర్‌లో 953 మార్కులు ఇంటర్‌లో సాధించాడు. అక్కడే ఉంటూ ఐఐటీ అకాడమీలో చదువుకున్నాడు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 116 ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం విజయవాడలో ఉంటున్న జ్యోతిరాదిత్య మాట్లాడుతూ.. ముంబాయిలో ఐఐటీ చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు. ఆ విద్యార్థి సోదరి ఉషశ్రీ విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజ్‌లో బీడీఎస్ చదువుతున్నారు. జ్యోతిరాదిత్య తెలంగాణా ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● శ్రీనిధికి పదో ర్యాంకు..



ధనుకొండ శ్రీనిధి

కొమరాడ: కొమరాడ మండలం దళాయిపేట గ్రామానికి చెందిన ధనుకొండ శ్రీనిధి తెలంగాణ ఎంసెట్‌లో ఇంజనీరింగ్‌లో రాష్ట్రస్థాయి పదో ర్యాంకును సాధించింది. ఆ విద్యార్థిని తల్లిదండ్రులు విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కొన్నేళ్లుగా వారు విజయనగరంలోనే నివాసం ఉంటున్నారు. శ్రీనిధి టెన్త్ సీబీఎస్‌ఈలో 490/500 మార్కులు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియాలో ఓపెన్‌లో 261 ర్యాంకు, ఓబీసీలో 35వ ర్యాంకు సాధించింది. శ్రీనిధికి రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐఏఎస్ సాధించాలన్నదే లక్ష్యం..

సివిల్స్‌కు ప్రిపేరై ఐఏఎస్ సాధించాలన్నదే నా లక్ష్యం. టీఎస్ ఈఏపీ సెట్‌లో పదో ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ సాధించి ముంబాయి ఐఐటీలో ఇంజనీరింగ్ చేయడం, తరువాత సివిల్స్‌కు ప్రిపేరై ఐఏఎస్ సాధించాలని గోల్‌గా పెట్టుకున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. అందుచేత లక్ష్యాన్ని ఛేదించగలనన్న పట్టుదల, నమ్మకం ఉంది. నాన్న ధనుకొండ శ్రీనివాసరావు నెల్లిమర్ల మండలం సారిపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్. అమ్మ గేదెల సుశీల ఎస్‌జీటీగా దత్తిరాజేరు మండలం పొరలి పాఠశాలలో పనిచేస్తున్నారు. విజయనగరం పూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్నాం. టెన్త్ సీబీఎస్‌ఈలో 500 మార్కులకు గాను 490మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 261, ఓబీసీ విభాగంలో 35వ ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వస్తుందన్న నమ్మకం ఉంది.

-ధనుకొండ శ్రీనిధి, టీఎస్ ఈఏపీసెట్ పదో ర్యాంకర్

● సాలూరు వాసికి 72వ ర్యాంక్



లోచన్

సాలూరు రూరల్: తెలంగాణ ఈఏపీ సెట్‌లో సాలూరు విద్యార్థి మరడాన సాయి శివలోచన్ 72వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడదలైన జేఈఈ రెండు ఫలితాల్లో సగటున 99.9972 శాతం పర్సెంటైల్ సాధించాడు. దీంతో ఆలిండియా జనరల్‌లో 93 ర్యాంక్, ఓబీసీలో 16వ ర్యాంక్‌ను సాధించాడు. పదో తరగతి వరకు గుడివాడ, ఇంటర్‌ను విజయవాడలో పూర్తి చేశాడు. ఆయన తండ్రి మోహనరావు, తల్లి సునీత పాచిపెంట మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. లోచన్ ఈ నెల 26న జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రాయనున్నాడు. తెలంగాణ ఈఏపీ సెట్‌లో 72వ ర్యాంక్ సాధించిన లోచన్‌కు పలువురు ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు, ఎంఈవోలు అభినందనలు తెలిపారు.

అలసత్వం వద్దు

- ఓట్ల లెక్కింపు నిర్వహణపై కలెక్టర్ ఆదేశం

గరుగుబిల్లి, మే 18 : ఓట్ల లెక్కింపు నిర్వహణపై అలసత్వం వహించరాదని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఉల్లి భద్ర ఉద్యాన కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు, పరిసర ప్రాంతాలను శనివారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం సహకరించాలన్నారు. పక్కా ప్రణాళికలతో ఈ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నాలుగు నియోజకవర్గాలకు చెందిన వారు అధికంగా ఇక్కడకు వచ్చే అవకాశం ఉందని, భారీ వాహనాలను దారి మళ్లించాలని ఆదేశించారు. ఎదుట గుర్తింపు కార్డులు కలిగిన సాధారణ ఏజెంట్లను మాత్రమే ప్రవేశ ద్వారం గుండా అనుమతించాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది నియామకం, బారికేడ్లు ఏర్పాటు అంశాలపై ఎస్పీతో కలెక్టర్ చర్చించారు. పార్లమెంటు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు గదులను సిద్ధం చేసి నివేదికలను అందించాలని ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడును ఆదేశించారు. కంట్రోల్ రూము, స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక బలగాలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలో 3వ తేదీన లెక్కింపు కేంద్రం సమీపంలోని గ్రామస్థులు బయట ప్రాంతవాసులకు ఆశ్రయం కల్పించరాదన్నారు. ఈ మేరకు పరిసర గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. స్ట్రాంగ్ రూముల పర్యవేక్షణకు నియమించిన అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ దిలీప్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఓఎస్‌డీ సూర్యనారాయణ, పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎందుకీ నిర్లక్ష్యం?

- జిల్లాలో 1,76,376 మంది ఓటుకు దూరం

పార్వతీపురం, మే18 (ఆంధ్రజ్యోతి): వజ్రాయుధంలాంటి ఓటు హక్కు ద్వారా మంచి పాలకులను ఎంచుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉంది. ఒకవేళ ఎవరికీ ఓటు వేయకూడదని భావిస్తే నోటా మీట నొక్కవచ్చు. అయితే ఓటు విలువ గురించి ఎవరు ఎంతలా మొత్తుకుంటున్నా కొంతమందిలో మార్పు రావడం లేదు. ఓటుహక్కుపై బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటుతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతగా అవగాహన కల్పించినా.. వారి తీరు మారలేదు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో జిల్లాలో 1,76,376 మంది 'మనకెందుకులే' అనే ధోరణితో వ్యవహరించి.. ఓటుకు దూరంగా ఉండిపోయారు.

ఇదీ పరిస్థితి..



జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పరిస్థితి చూస్తే.. పార్వతీపురంలో 1,88,817 మంది ఓటర్లు ఉండగా 1,48,502 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గంలో 40,315 మంది ఓటు వేయలేదు. పాలకొండలో 1,95,020 మందికి గాను 1,48,781 మంది ఓటు వేశారు. ఇక్కడ 46,239 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. సాలూరులో 2,04,489 మంది ఓటర్లు ఉండగా 1,56,331 మంది ఓటు వేశారు. ఈ నియోజకవర్గంలో 48,158 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. కురుపాంలో 1,94,114 మంది ఓటర్లు ఉండగా, 1,52,450 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 41,664 మంది ఓటు వేయలేదు. సాలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఉన్నారు. అవగాహన లేకనా... లేక ఓటింగ్‌పై ఆసక్తి లేకా.. అనే విషయం వారికే ఎరుక. అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేందుకు వందలాది మంది స్వగ్రామాలకు వచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేశారు. అయినా కొందరిలో మాత్రం చలనం రాలేదు. వారంతా ఓటు వేసి ఉంటే పోలింగ్ శాతం మరింత పెరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడెలా?



- అకాల వర్షాలతో మొక్కజొన్న రైతుల్లో కలవరం
- పంటను విక్రయించుకోలేక.. కాపాడుకోలేక అవస్థలు
- నామమాత్రంగా ప్రభుత్వ మద్దతు ధర
- ఇదే అదునుగా దళారుల రంగ ప్రవేశం
- రోజురోజుకూ ధరను తగ్గిస్తున్న వైనం

కొమరాడ/ జియ్యమ్మవలస, మే 18: జిల్లాలో మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆశించిన స్థాయిలో మద్దతు ధర లేక.. పంటను విక్రయించు కోలేక నానా అవస్థలు పడుతు న్నారు. మరోవైపు అకాల వర్షాలు వారిని కలవర పెడుతున్నాయి. కొనుగోలుకు చర్యలు చేపట్టామంటున్న అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారు. దీంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు. జిల్లాలో 3,492 మంది రైతులు 11,820 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. గతేడాదితో పోలిస్తే.. రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. కాగా ఈ ఏడాది 41,279 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. అయితే దీని కొనుగోలుకు 209 ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఒక్క రైతు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న ధర కంటే మార్కెట్‌లో ధర అధికంగా ఉండడమే. ప్రభుత్వం క్వింటాకు రూ. 2090లు మద్దతు ధరగా నిర్ణయించింది. అయితే మార్కెట్‌లో రూ. 2,100 నుంచి రూ. 2,300ల వరకు ధర పలుకుతోంది. దీంతో రైతులందరూ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో దళారులు, ప్రైవేట్ వ్యాపారులు సగానికి పైగా పంటను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే అదునుగా కొందరు గోనె సంచులకని, రవాణా ఇతరత్రా ఖర్చులకని రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

ఎవరూ ముందుకు రాలేదు

జిల్లాలో 209 ఆర్‌బీకేలలో మొక్కజొన్న కొనుగోలు రిజిస్ట్రేషన్‌కు చర్యలు చేపట్టాం. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అందుకే కొనుగోలు చేయలేకపోయాం. ప్రభుత్వ మద్దతు ధరకు, బయట వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధరకు పెద్ద వ్యత్యాసం లేదు.

\- విమల, డీఎం, మార్క్‌ఫెడ్, పార్వతీపురం మన్యం జిల్లా

గతేడాదిలో ఇలా..

గతేడాది రబీ సీజన్‌లో క్వింటా రూ.1962లకు 32 ఆర్‌బీకేల ద్వారా 475 మంది రైతుల నుంచి 3,404.50 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. అయితే అప్పటికే ఆర్‌బీకేల్లో టార్గెట్లు పూర్తవ్వడంతో చాలామంది ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయించాల్సి వచ్చింది.

వాతావరణ మార్పులతో ఆందోళన

ప్రస్తుతం అకాల వర్షాలతో పంటను రక్షించుకోలేక.. విక్రయించుకోలేక రైతులు సతమతమవుతున్నారు. మరోవైపు దళారులు రోజురోజుకూ ధర తగ్గిస్తూ పంటను కొనుగోలు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పిన ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని, దీనివల్ల నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎకరా సాగుకు సుమారు రూ. 30 వేల వరకు ఖర్చయిందని, మద్దతు ధరను రూ.3వేలుగా నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కన్నపుదొరవలసలో మొక్కజొన్న పంటను బస్తాలకు ఎత్తిన దృశ్యం

పైడిమాంబ దేవర ఉత్సవానికి వేళాయె

విజయనగరం రూరల్, మే 18: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడిమాంబ తల్లి దేవర ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం జరిగే దేవర ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో రానున్న దృష్ట్యా చదురుగుడి వద్ద ప్రత్యేక క్యూలైన్లు, షామియానాల వంటివి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి నుంచి మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురుగుడికి అమ్మవారిని తీసుకురావడమే దేవర ఉత్సవం ప్రధాన ఉద్దేశం. ఈ ఉత్సవం అక్టోబరులో జరిగే సిరిమానోత్సవానికి నాంది వంటిది. ఏటా వైశాఖమాసంలో ఈ ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సిరిమానోత్సవం వరకూ అంటే ఆరు నెలలు అమ్మవారు చదురుగుడిలో ఉండి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పార్వతీపురం, మే18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్వతీపురం డీవీఎంఎం, సాలూరు, పాలకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మొత్తంగా 659 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలన్నారు. పరీక్ష పేపర్లను నిర్దేశిత కేంద్రాలకు పంపించడానికి తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 384 మంది...

జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు 384 మంది హాజరుకానున్నారని ఇన్‌చార్జి డీఆర్వో తెలిపారు. పార్వతీపురం కేవీఎం పాఠశాలలో ఈ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు పార్వతీపురం ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతాయని, 288 మంది హాజరుకానున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ సుధాకర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.వినోద్, ఆర్టీసీ సహాయ మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో

ఇన్‌చార్జిలే దిక్కు..

- జిల్లాలో కీలక శాఖలకు పూర్తిస్థాయి అధికారులేరీ?
- కింది స్థాయి సిబ్బందికి అదనపు బాధ్యతలు
- నెలలు గడుస్తున్నా.. వారితోనే నెట్టుకొస్తున్న వైనం
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని వైసీపీ సర్కారు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు ● ప్రభుత్వ తీరుపై మండిపాటు

పార్వతీపురంలో కలెక్టర్ కార్యాలయం



పార్వతీపురం, మే18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు కీలక శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. దీంతో ఇన్‌చార్జిలే దిక్కుగా మారారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి కీలక పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు లేరు. కింది స్థాయి సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించారు. నెలల తరబడి వారితోనే నెట్టుకొస్తున్నారు తప్ప ఆయా పోస్టులను భర్తీ చేయడం లేదు. కొత్తగా జిల్లా ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయి అధికారుల నియామకంపై మాత్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పరిపాలన సక్రమంగా సాగాలన్నా.. అభివృద్ధి పనులు జరగాలన్నా అధికారులు ఎంతో కీలకం. అయినా వైసీపీ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోకపోడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పరిస్థితిని ఇప్పుడు తెలుసుకుందాం..

రెవెన్యూశాఖ...

ఎంతో కీలకమైన రెవెన్యూ శాఖకు కూడా పూర్తిస్థాయి అధికారి లేరు. జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన వెంకటరావు బదిలీపై కాకినాడకు వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మరెవర్నీ నియమించలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఆర్వోగా కేశవనాయుడు వ్యవహరిస్తున్నారు.

జిల్లా మలేరియా శాఖ ..

మలేరియాకు కేరాఫ్‌గా ఉన్న జిల్లాకు పూర్తిస్థాయి అధికారి లేరు. ఏటా వర్షాకాలంలో అధికంగా డెంగ్యూ, మలేరియా తదితర కేసులు నమోదవుతున్నా.. పూర్తిస్థాయి అధికారిని మాత్రం నియమించడం లేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారిగా జగన్మోహన్‌రావు వ్యవహరిస్తున్నారు.

ఐటీడీఏలో..

పార్వతీపురం ఐటీడీఏలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టుకు పూర్తిస్థాయి అధికారి లేరు. ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శివకుమార్ వ్యవహరిస్తున్నారు. ఆయన పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉంటూ అదనపు బాధ్యతలు చేపడుతున్నారు. సుమారు రెండేళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది.

పంచాయతీరాజ్...

పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణాజీ పార్వతీపురం పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఇంజనీర్ అధికారిగా కూడా విధులు నిర్వర్తిస్తు న్నారు. ఒకే అధికారి మూడు పోస్టుల బాధ్యతలను చేపడుతున్నారు.

రోడ్లు భవనాల శాఖ...

రోడ్లు భవనాల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులో గతంలో పనిచేసిన జేమ్స్ బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఆయన స్థానంలో కురుపాం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వేణుగోపాలరావు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్నారు. అదే విధంగా జిల్లా ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారిగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ శాఖలో కూడా ఒకే అధికారి మూడు పోస్టుల బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు కూడా పూర్తిస్థాయి అధికారి లేరు. ఇటీవల డీఎంహెచ్‌వో జగన్నాథరావు రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో నియమించారు. వైద్య ఆరోగ్య శాఖకు డీఎంహెచ్‌వో ఎంతో కీలకం. ఆ పోస్టును పూర్తిస్థాయి అధికారితో భర్తీ చేయకుండా, ఇన్‌చార్జిగా సీతంపేట అధికారికి బాధ్యతలు అప్పగించారు.



డీఆర్‌డీఏలో...

జిల్లాలోని డీఆర్‌డీఏలో ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో పీడీగా పనిచేసిన పి.కిరణ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆ తర్వాత పూర్తిస్థాయి అధికారిని నియమించలేదు. ఐటీడీఏ వెలుగు విభాగంలో పనిచేస్తున్న ఏపీడీ సత్యంనాయుడు ఇన్‌చార్జి పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారి పర్యవేక్షణలో...

వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్య క్రమానికి కూడా ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారే దిక్కుగా మారారు. డాక్టర్ వినోద్ ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారిగా ఉన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా ఫ్లిక్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్ధార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.

రొమాంటిక్ సిల్క్ శారీ



వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.

శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ



చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్.

అర్హత: సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్టులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

దిక్సూచి DIKSUCHI

ఐఐఎస్సీలో బీటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.


ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VTVnpuoలో చదవండి.







ఐశ్వర్య నరసింహ స్వామి వారికి కల్యాణ పందిరిరాట



పందిరిరాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

జామి, మే 18: మండలంలో కుమరాం గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ ఐశ్వర్య నరసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో పందిరాట మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో చంద్రకళ తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని.. అధికారులు హాజరుకావాలని కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి జరిగిన పోస్టల్ బ్యాలెట్‌ను మండల తహసీల్దారు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ తరలించే సమయంలో పాలకపక్షం కాకుండా ప్రతిపక్ష, స్వతంత్ర్య అభ్యర్థులకు సమాచారం అందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్వతంత్ర్య అభ్యర్థి పాండ్రంకి వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదును మెయిల్ చేశారు. ఈ నెల 16న తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంను మధ్యాహ్నం 4.30 గంటలకు తెరిచినప్పుడు స్వతంత్ర్య అభ్యర్థిగా తనకు సమాచారం అందలేదని, అనధికారిక వ్యక్తులను ఆర్వో లేని సమయంలో ఏఆర్ఓ లోపలకి అనుమతించారన్నారు. అనధికార వ్యక్తులను లోపటికి అనుమతించడంపై జిల్లాలోని ప్రజలకు పలు అనుమానాలు తావిస్తుందన్నారు. కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కిందస్థాయి అధికారికి షోకాజ్ నోటీసు ఇచ్చారని, దీనిలో భాగంగా ఉన్న అధికారి నుంచి కూడా వివరణ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కౌంటింగ్ జరిగేంత వరకూ సంబంధిత స్ట్రాంగ్ రూంలకు 24 గంటలు సీసీ టీవీ లైవ్ చూసుకునేందుకు పోటీల్లో ఉన్న అభ్యర్థుల ఫోన్లకు వెసులుబాటు కల్పించాలని కోరారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజాం రూరల్, (బొబ్బిలి): మూడురోజుల పాటు జరగనున్న పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. సుప్రభాతసేవతో ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకపూజలు జరిపారు. శనివారం రాత్రి స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న కల్యాణం, 20న ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాంత భక్తులంతా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి: మండలంలో ఉంగరాడఫీడర్ పరిధిలో ఉన్న కొత్తచెలిగానవలస, రంగరాయపురం గ్రామాలకు విద్యుత్‌సబ్‌స్టేషన్ నిర్వహణపనుల్లో భాగంగా ఈనెల 20 విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు స్థానిక విద్యుత్ ఏఈ హరిబాబు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఈగ్రామాలకు పూర్తిగా కరంట్ ఉండదని, గ్రామస్థులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు కొత్తమ్మతల్లి పండగ

విజయనగరం రూరల్: విజయనగరంలోని ఫూల్‌బాగ్‌లో ఉన్న కొత్తమ్మతల్లి పండగ ఆదివారం జరగనుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఘూటాల ఊరేగింపు కార్యక్రమం స్థానిక అద్దెపల్లెవారు వీధిలోని కంది వారి ఇంటి నుంచి ప్రారంభం కానుంది. ఈ ఊరేగింపు కార్యక్రమం అద్దెపల్లెవారు వీధిలో ప్రారంభమై, కొత్తపేట, గోకులపార్కు, రింగురోడ్డు జంక్షన్, ప్రేమసమాజం, లక్ష్మీగణపతి కాలనీ మీదుగా అమ్మవారి ఆలయం వరకూ సాగుతుంది. మేళతాళాలు, నేలవేషాలతో ఈ ఊరేగింపును నిర్వహించనున్నారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కొత్తమ్మతల్లిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకోనున్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

విజయనగరం రూరల్: నగరంలోని 38వ డివిజన్ పరిధిలోని టీడీపీ కార్యకర్త రవి ఈ నెల 12న మరణించారు. ఆయన కుటుంబానికి పట్టణ తెలుగుయువత నాయకులు పీతల కోదండరామ్, ఇమ్రాన్, బాబితో పాటు పలువురు యువత కార్యకర్తలు వెళ్లి సంతాపం తెలిపారు. అదే విధంగా రూ. 10 వేలు ఆయన కు టుంబానికి ఆర్థిక సాయం అందించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

శృంగవరపుకోట, మే 18: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవీంద్ర రైతులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతుల పొలాల భూసారం పెంచేందుకు ఉపయోగపడే జనుమ, పిల్లిపెసర, జీలుగ విత్తనాలను రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉండే వీఏఏలకు తమ ఆధార్ కార్డు, ఫోన్‌నెంబర్ ఇచ్చి పొందవచ్చన్నారు.

బాడంగి: ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగ, కట్టిజనుము, పిల్లిపెసర) రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ తెలిపారు. రేజేరు రైతు భరోసా కేంద్రంలో 17 క్వింటాల విత్తనాలు వచ్చి ఉన్నాయని, ప్రస్తుతం వాటికి ఆర్‌బీకేలో మొలకశాతం పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. సోమవారం నుంచి కృషి విధానంలో రైతుల బయోమెట్రిక్ తీసుకొని పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఆర్‌బీకేలకు వచ్చి సంప్రదించాలన్నారు. జీలుగ, కట్టిజనుము విత్తనాల ధర రూ.88లు కాగా 50 శాతం రాయితీపోను రూ.44లు, కట్టిజనుము విత్తనాల ధర రూ.88లు కాగా 50 శాతం రాయితీపోను రూ.44లు, పిల్లిపెసర కేజీ విత్తనాల పూర్తి ధర రూ.134 కాగా 50శాతం రాయితీపోను రూ.67లకు అందజేస్తున్నట్లు తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక హైస్కూల్ హెచ్.ఎం, కె. విస్సు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పిల్లలకు నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు చదివించడం, ఆటలు పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు.

రాష్ట్రంలో ఏర్పాటయ్యేది కూటమి ప్రభుత్వమే

● చీపురుపల్లి అభ్యర్థి కళావెంకటరావు

చీపురుపల్లి, మే 18: రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమని, నారా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాబోతున్నారని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 1983, 1994లో తెలుగుదేశం పార్టీకి వచ్చిన ఆదరణ ఇప్పుడు తిరిగి కనిపిస్తోందన్నారు. చంద్రబాబునాయుడు సీఎం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. పది రూపాయలిచ్చి, 90 రూపాయలు లాగేసిన జగన్‌మోహనరెడ్డిని బంగాళాఖాతంలో కలపపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్న ఆందోళన ప్రజల్లో నెలకొందన్నారు. ఈ కారణంగానే ప్రజలు వైసీపీని చిత్తుగా ఓడించాలని నిర్ణయించుకున్నారని వెంకటరావు అన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ఏ వర్గమూ స్వేచ్ఛగా బతికిన పరిస్థితి లేదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలన్నీ చేతిలో పెట్టుకొని జగన్ గడిచిన కాలంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అస్మదీయులు, తస్మదీయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చేయించుకోవాలన్న ఉద్దేశంతో, తిరిగి తమ ప్రభుత్వమే రాష్ట్రంలో ఏర్పాటవుతుందని వైసీపీ నాయకులు అధికారుల ఎదుట ప్రగల్భాలు పలుకుతున్నారని కళా వ్యాఖ్యానించారు. చీపురుపల్లిలో తన విజయం ఖాయమని, రాష్ట్రంలో కూటమికి 160కి పైగా సీట్లు వస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, టి. కిరణ్, సారేపాక సురేష్, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: విలేకరులతో మాట్లాడుతున్న కళా వెంకటరావు

కళాను కలిసేందుకు తరలివచ్చిన నేతలు

రాజాం: టీడీపీ సీనియర్ నాయకుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావును కలిసేందుకు పలు నియోజకవర్గాల నుంచి నాయకులు, ముఖ్యులు తరలివస్తున్నారు. శనివారం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలు నియోజకవర్గాల నుంచి నాయకులు తరలివచ్చారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కళా దాదాపుగా 40 రోజులు పాటు అక్కడే ఉండిపోయారు. పోలింగ్ అనంతరం బుధవారం ఆయన నివాసానికి వచ్చారు. అనంతరం శనివారం వరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియ ఫలితంపై సమీక్ష జరుపుతున్నారు. అదే సమయంలో చీపురుపల్లిలో జరిగిన ఎన్నికల సరళి, పోలింగ్ తీరు, ఫలితంపై కూడా చర్చించారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అవ్వడంతో ప్రజల్లో కొంతమార్పు వచ్చిందని ప్రజలు ఆ పార్టీని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని కళా అన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

● జేఎస్ఎల్ కార్మికులకు సంఘీభావం ప్రకటించిన కోళ్ల

కొత్తవలస, మే 18: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ, జిందాల్ నగర్‌లో ఉన్న జిందాల్ స్టెయిన్‌లెస్ కర్మాగారంలో విధించిన లాకౌట్‌ను యాజమాన్యం వెంటనే ఎత్తి వేయాలని శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. శనివారం ఉదయం కర్మాగారం ఎదుట కార్మికులు చేస్తున్న ఆందోళనకు ఆమె సంఘీభావం తెలిపారు. కార్మికులు చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లి లలిత కుమారి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసేయడం విచారకరమన్నారు. జిందాల్ కర్మాగారం తెరచి కార్మికులకు న్యాయం చేసేవరకు తాను కార్మికులకు పూర్తి మద్దతు ఇస్తానని తెలిపారు. అనంతరం కర్మాగార యాజమాన్య ప్రతినిధి గోపాకృష్ణతో చర్చించారు. చాలా మంది కార్మికులు 50 సంవత్సరాలు వయస్సు పైబడి ఉన్నారని ఇటువంటి తరుణంలో కర్మాగారంలో లాకౌట్ విధిస్తే ఎక్కడకు వెళ్లి పని చేసుకోగలరన్నారు. కర్మాగారానికి సంబంధించి ముడిసరుకు కొరత, ఉత్పాదకత వ్యయం పెరిగిపోవడం వలన నష్టాల బారిన పడిన కారణంగానే కంపెనీని మూసేయాలసిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపించడం కోసం తమ సంస్థలకు చెందిన ఒడిశాలోని యూనిట్‌లో పని కల్పించడం కోసం మాట్లాడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోళ్ల వెంకటరమణ, తిక్కాన చినదేముడు, బొబ్బిలి అప్పారావు, గొరపల్లి రాము, కొరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సంఘీభావ సభలో మాట్లాడుతున్న లలిత కుమారి

డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు

జేఎస్ఎల్ కర్మాగారంలో లాకౌట్ విధించడంపై కర్మాగారంలోని రెండు కార్మిక సంఘాలు విజయనగరానికి చెందిన డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కర్మాగారానికి చెందిన వైఎస్ఆర్ పార్టీకి చెందిన కార్మిక సంఘం అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, సీఐటీయూ కార్మిక సంఘం తరఫున గాడి అప్పారావు, రెండు సంఘాలకు చెందిన నాయకులు ఫిర్యాదు చేశారు.

కన్నుల పండువగా కన్యకాపరమేశ్వరి జయంతి

జామి/శృంగవరపుకోట రూరల్, మే 18: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి వేడుకలు శనివారం కన్నుల పండువగా జరిగాయి. జామి, శృంగవరపుకోట మండలాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎస్.కోట మండలం బొడ్డవరలో అమ్మవారికి 108 రకాల నైవే.ద్యాలను సమర్పించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్ర మంలో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు పూసర్ల కోటిరత్నం, ఎస్.కోట సంఘ అధ్యక్షురాలు కందుకూరి కల్యాణి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



బొడ్డవరలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

భోగాపురం: భోగాపురం గ్రామంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శనివారం వాసవీ కన్యాకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబా ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం కలశాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, మే 18: మండలంలోని బొడ్డవర గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మిగణపతి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకూర్తి సాయికుమార్‌శర్మ ఆధ్వర్యంలో కందుకూరి మణికంఠ, కందుకూరి హర్ష, కల్లూరి జగన్నాథస్వామి దంపతులు పూజలు చేశారు. ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ అలరించింది.

చర్చలేకుండా ముగిసిన మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో

రేగిడి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పల నరసమ్మ అధ్యక్షతన శనివాం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎన్నికలకోడ్ అడ్డుయింది. సభలో ఎటువంటి చర్చలేకుండా అర్ధంతరగా ముగించారు. అయితే పంచాయతీరాజ్ చట్టప్రకారం గత జనర ల్‌బాడీ నిర్వహించి 90 రోజులు పూర్తికావటం, చట్టప్రకారం ఈసమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంపీపీ టెంకాల అచ్చం నాయుడు, వి జగన్మోహనరావు సభకు తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి: కమిషనర్

రాజాం రూరల్ (బొబ్బిలి): గొల్లపల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరమ్మతుల పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని గొల్లపల్లి, మార్కెట్‌రోడ్, రావువారి వీధి, మెయిన్‌రోడ్ ప్రాంతాలలో రోడ్ల మరమ్మతుల పనులతో పాటు కల్వర్టులపై శ్లాబుల ఏర్పాటు పనులను శనివారం ఆమె టౌన్‌ప్లానింగ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటరీ అధికారితో పాటు పలుశాఖల సిబ్బందితో కలిసి పరిశీలించారు. సిరిమాను తిరిగే సమ యంలో ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండే విధంగా రోడ్లపై ఉన్న వ్యర్థాలను తొలగించాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.

పిల్లలతో ప్రేమగా ఉండాలి

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 18: పిల్లలతో ప్రేమగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉండాలని బొబ్బిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోహిణి రావు పిలుపునిచ్చారు. బొబ్బిలి మండలం మెట్టవలసలో శని వారం ఆమె న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తప్పిపోవడంపై ఆమె మాట్లాడారు. ఇంట్లో పిల్లలకు ప్రేమతో చూడాలన్నారు. కుటుంబ పరిస్థితులపై అవగాహన కల్పించాలన్నారు. వారికి మంచి జీవితం అందేలా తమ పరిధిలో తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. న్యాయవాది డీఎల్ దీపావళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి

వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు

రాజాం రూరల్, మే 18: ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో వివాదాలు సృష్టిస్తే చర్యలు తప్పవని సీఐ మోహనరావు హెచ్చరించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని గురవాం, గడిముడిదాం, బొద్దాం తదితర గ్రామాల్లో గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికలకు ముందు, ఆ తరువాత జరిగిన సంఘటనల ఆధారంగా వివాదాల జోలికి పోవద్దని హితవు పలికారు.



గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ

రాజకీయ కక్షలు పెంచుకోవద్దు



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం, మే 18: గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు రాజకీయ కక్షలు పెంచుకోకుండా ఐకమత్యంతో ఉండాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. మిర్తివలస గ్రామంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసినప్పటికీ జూన్ 4వ తారీకు వరకు కోడ్ అమలులో ఉందని తెలిపారు. గ్రామాల్లో రచ్చబండలు, ప్రధాన కూడళ్లవద్ద గుంపుగుంపుగా ఉండరాదని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ కూడా పాల్గొన్నారు.

మోక్షం కలిగేనా?

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వేములాపల్లి పంచాయతీ గ్రాజు కళ్లాలు సమీపంలో 300 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం సాయిరాం ఎత్తిపోతల పథకం నిర్మించింది. అయితే ఇది సరిగ్గా 2018లో పూర్తయినా అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం దీనికి ప్రారంభోత్సవం చేయలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీని ఊసే మరిచింది. ఇక్కడ ఒక పథకం ఉందన్న విషయం విస్మరించడంతో ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయంపై ఎత్తిపోతల పథకం ఆయకట్టుదారులు మాట్లాడుతూ తమ భూములు సస్యశ్యామలం చేసేందుకు నాటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి రెండుకోట్ల నిధులు తెప్పించి ఈ పథకాన్ని పూర్తిచేస్తే, అధికారంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమది రైతుల ప్రభుత్వం అని ఉదరగొట్టింది తప్ప రూ.రెండుకోట్లతో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు కనీసం ప్రయత్నం చేయలేదు. వారి హయాంలో నిర్మించిన పథకానికి మనం ప్రారంభించడం ఏంటి అనే ధోరణిలో వైసీపీ ప్రభుత్వ ధోరణి సాగిందని రైతులు వాపోతున్నారు. రాజకీయ నాయకుల చర్యల వల్ల తమ పొలాలు బీడువారిపోయాయని వాపోయారు. ఈసారి అధికారంలోకి వచ్చే ప్రభుత్వం అయిన దీనిని ప్రారంభించాలని వేడుకుంటున్నారు.



ఆరేళ్లయినా ప్రారంభానికి నోచుకోని సాయిరాం ఎత్తిపోతల పథకం

చెరువులో జారిపడి బాలుడు మృతి

దత్తిరాజేరు, మే 18: మండలంలోని రాజుల రామచంద్రపురం గ్రామంలో చెరువులో జారిపడి 5వ తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్టేషన్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్న కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజుల రామచంద్రపురం గ్రామానికి చెందిన మండాది గౌతమ్(10) 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల కావడంతో తమ స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న పప్పలచెరువు వద్దకు బహిర్భూకి వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి చెరువులో పడిపోయాడు. తనతో వచ్చిన స్నేహితులు కేకలు వేసినా సమీపంలో ఎవరు లేకపోవడంతో గ్రామములోకి పరుగులంకించి గ్రామస్థులకు జరిగిన విషయం చెప్పారు. గ్రామస్థులు కుటుంబసభ్యులు హుటాహుటీన చెరువు వద్దకు వచ్చారు. గౌతమ్ ను రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే విద్యార్థి గౌతమ్ ప్రాణాలు విడిచాడు.గౌతమ్ తల్లి సత్యవతి కొన్నేళ్ళ క్రితం మృతి చెందింది. తండ్రి రామునాయుడు ఇద్దరు కుమారులను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఎప్పటికో కుమారుడు వరుణ్ 7వ తరగతి చదువుతున్నాడు.

మృతురాలి ఆచూకీ లభ్యం

● భర్తే అఘాయిత్యానికి పాల్పడినట్టు అనుమానం



రూత్‌భూయన్ (ఫైల్)

సీతంపేట: మండలంలోని పులిపుట్టి సమీపంలో ఉన్న ఎర్ర చెరువు వద్ద హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యమైనట్టు సీతంపేట ఎస్ఐ జగదీష్‌నాయుడు శనివారం తెలిపారు. శనివారం సీతంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మృతురాలి కుటుంబ సభ్యులు దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రోగడ గ్రామానికి చెందిన రూత్ భూయన్(47), భర్త మిఖాయిల్ ఇస్మాయిల్ భూయాన్‌తో కలిసి ఈ నెల 16న బూర్జ మండలం అడ్డూరుపేట గ్రామంలో బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంపై వెళ్లిందని మృతురాలి సోదరుడు మోజెష్‌రైతో తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 17న ఉదయం పులిపుట్టి ఎర్ర చెరువు వద్ద ఓ మహిళ మృతదేహాన్ని పలువురు గుర్తించి సమాచారాన్ని పోలీసులకు అందించారు. పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, సీతం పేట ఎస్ఐ జగదీష్‌నాయుడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా సీతంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి ఆచూకీ కోసం ఒడిశా పోలీసులను కూడా సంప్రదించినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. దీనితో సోషల్ మీడియాలో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శనివారం సీతంపేట వచ్చి వివరాలు తెలియజేశారు. భార్యభర్తలు వివాహానికి బయలుదేరి ఇంటికి చేరకపో౼డం, తన చెల్లి హత్యకు గురికావడం, తన బావకు సంబంధించిన రెండు ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పోలీసులకు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై కుటుంబ సభ్యుల నుంచి పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్నామని, భర్త ఆచూకీ దొరికితేనే అసలు వివరాలు తెలుస్తాయని, ఆయన ఆచూకీ కోసం పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి ప్రత్యేక దృష్టిసారించినట్టు ఎస్ఐ తెలిపారు.

బొబ్బిలిలో రేషన్ బియ్యం పట్టివేత

సాలూరు రూరల్ (బొబ్బిలి): బొబ్బిలి నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం అధికారులు పట్టుకున్నారు. నిర్భయంగా బొబ్బిలి బస్టాండ్‌లో రూ.1.45 లక్షలు విలువ చేసే 66 బస్తాల రేషన్ బియ్యంను ట్రక్‌లోకి లోడ్ చేశారు. వాటిని పిరిడి గ్రామానికి తరలిస్తున్నారు. బహిరంగంగా రేషన్ బియ్యం లోడ్ చేసి తరలిస్తున్న విషయం తెలియడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. రేషన్ బియ్యం లోడ్ వెళ్తున్న వాహనాన్ని బొబ్బిలి పొలిమేర వద్ద పట్టుకొని సీజ్ చేశారు.



రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

కోనేరు జోలికి పోవద్దు

బొబ్బిలి: స్థానిక ఫూల్‌బాగ్‌లో గల గుర్రపుకోనేరు(నారాయణి క్షేత్రం) జోలికి ఎవ్వరూ పోవద్దని బొబ్బిలి సీఐ నాగేశ్వరావు ఆదేశించారు. ఈ క్షేత్రంలో గల విగ్రహాలను కొంతమంది ధ్వంసం చేశారని గీతామండపం కమిటీ, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పోలీస్, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా వెళ్లి శనివారం ఫిర్యాదుదారల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 5.50 ఎకరాల విస్తీర్ణంలోని కోనేరులో గల లక్ష్మీనారాయణ ఆలయంలో విగ్రహాలను, ఆలయ శిఖర కళశాన్ని దొంగిలించినట్లు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తునకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకూ ఎవ్వరూ ఈ వ్యవహారం జోలికి పోవద్దని సి.ఐ. నాగేశ్వరావు హెచ్చరించారు. కోనేరును కొనుగోలు చేసిన వ్యక్తులతో పాటు ఫిర్యాదుదారులతో సి.ఐ. నాగేశ్వరావు విచారించిన సమయంలో ఇరుపక్షాలకు చెందిన న్యాయవాదులు హాజరు కావడం గమనార్హం.

నిందితులను అరెస్టు చేయాలి

● దళిత జేఏసీ డిమాండ్

రేగిడి: రేగిడి మండలం చిన్నశిర్లాంలో ఈనెల 11 అర్ధరాత్రి హత్యకు గురైన ఉత్తరావల్లి సంగాం కేసును తక్షణమే చేధించి నిందితులను అరెస్టు చేయాలని దళిత జేఏసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల హత్యగావించ బడ్డ సంగాం కుటుంబ సభ్యులను శనివారం దళిత జేఏసీ ప్రతనిధులు దేబారికి రామప్పడు, బొత్స బుద్ధుడు, పేకేటి రామారావు, పాండ్రంకి శ్రీనివాసరావు, తేగల మోహనరావు, ఈసరి రాజు తదితరులు పరామర్శించారు. ఈసందర్భంగా వీరు విలేఖర్లుతో మాట్లాడుతూ దోషులు ఎంతటి వారైన పోలీసలు తక్షణమే పట్టుకొని శిక్షపడేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంగాం ఆత్మకు శాంతిచేకారాలని వీరు కుటుంబీకులకు తమ ప్రగాడ సానుభూతి తెలిపారు. ,దళిత జేఏసి ఈకుటుంబానికి అండగా ఉంటుందని పూర్తి భరోసా ఇచ్చారు.



సంగాం కుటుంబీకులను పరామర్శిస్తున్న దళిత జేఏసీ ప్రతినిధులు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రాజాం, మే 18: టీడీపీ కార్యకర్త పెంకి గౌరీశ్వరరావు తల్లి పెంకి వరహాలమ్మ మృతి చెందడంతో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు పురపాలక సంఘం పరిధిలోని అమ్మవారి కాలనీకి ఆదివారం వెళ్లి పరామర్శించారు. ఆమె మృతిచెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల్లో కష్టపడి ఆయన విజయం కోసం నిరంతరం పనిచేసిన టీడీపీ కార్యకర్తలను పలకరించి అభినందించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్వవైభవం వస్తుందన్నారు. ఇచ్చిన హమీలు అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఈయనతో పాటు పెంకి చైతన్యకుమార్, శిరిష, ఉరిటి శశిభూషణరావు, సింహాచలం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మరడాం గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన టీడీటీ కార్యకర్త లోచర్ల ఈశ్వరరావు కుటుంబాన్ని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని, కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, క్లష్టర్ ఇన్‌చార్జ్‌లు బెజవాడ బంగారునాయుడు, పెద్దింటి జగన్, గ్రామ నాయకులు కర్రి అప్పలనాయుడు, సలాది గోపీ, సాంబ, ఆలమూరి నారాయణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంపావతి నదిలో బోరు

భోగాపురం, మే 18: భోగాపురంలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిపై 'భోగాపురంలో దాహం కేకలు' అనే శీర్షికతో ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. దానికి స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు జేఈ హేమంత్ ఆధ్వర్యంలో డెంకాడ మండలం నాతవలస సమీప చంపావతి నదిలో అదనంగా బోరు తవ్వించారు. దీంతో భోగాపురానికి నిత్యం తాగునీటి సరఫరాకు అవకాశం ఉంటుందని జేఈ తెలిపారు.

పదిలో మెరిసిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రాజాం: పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామని ప్రముఖ వైద్య నిపుణులు యడ్ల నీరజారాణి, సామంతు కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి మజ్జి దర్గమ్మ దివ్యాశీస్సులతో ఆమె ఆశయాలను కొనసాగిస్తూ రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి, జి సిగడాం, తెర్లాం, పాలకొండ, బూర్జ, మెరకముడిదాం, బలిజిపేట మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 540 మార్కులు పైబడి సాధించిన విద్యార్థినులకు ఒక పరీక్ష నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

ప్రమాదకరంగా తోటపల్లి వంతెన

- మలుపుల్లో ప్రమాదాలు
- కోతకు గురవుతున్న రహదారి
- పట్టించుకోని యంత్రాంగం, ప్రజాప్రతినిధులు



పాత బ్యారేజీ వంతెన రక్షణ గోడ కూలిన దృశ్యం



నందివానివలస ప్రాంతంలో గతుకులమయంగా ఉన్న ప్రధాన రహదారి

(గరుగుబిల్లి)

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పాత రెగ్యులేటర్‌పై నిర్మించిన వంతెన ప్రమాదభరితంగా తయారైంది. బ్రిటిష్ పాలకుల హయాంలో 1908లో వంతెన నిర్మించారు. ఈ మార్గం గుండానే కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన వంతెనకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇరువైపులా శిథిలమై ప్రమాదాలకు నిలయంగా తయారైంది. పార్వతీపురం నుంచి కురుపాం వచ్చీ పోయే ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా ఒకవైపు నాగావళి నది, మరోవైపు ప్రధాన ఎడమ కాలువలో పడాల్సిందే. గతంలో సంభవించిన వివిధ ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అలాగే భారీ వాహనాలు బోల్తా పడి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన పరిస్థితులు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో ఒకవైపు వచ్చే వాహనాలు కనిపించవు. ప్రమాదాల నెలకొంటున్నాయి. నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. అలాగే రహదారికి ఇరువైపులా కోతకు గురైంది. ఈ మార్గం అత్యంత దయనీయంగా ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా నందివానివలస, గిజబ గ్రామాల నడుమ ఉన్న మలుపులో రహదారి గోతులమయం కావడంతో ప్రమాదాలు సంభవించేవి. దీంతో కొంతమేర సీసీ రహదారి నిర్మించారు. ఈ రహదారికి ఆనుకుని పై ప్రాంతం, దిగువ ప్రాంతంలో సరిచేయకపోవడంతో గోతుల మాదిరిగా దర్శనమిస్తోంది. తోటపల్లి మార్గంలో చీకటి వేళల్లో ప్రయాణం చేయాలంటే వెనుకంజ వేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెనకు తాత్కాలికంగానైనా మరమ్మతులతో పాటు రక్షణ గోడ నిర్మాణం, కోతలకు గురైన ప్రాంతాన్ని సరిచేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పాత బ్యారేజీపై నూతన వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. ప్రధాన మార్గంలోని సమస్యలు నివేదించాం. కొంతమేర బీటీ రహదారి నిర్మించాం. నందివానివలస ప్రాంతంలో రహదారికి ఆనుకుని సీసీ రహదారి పనులు నిర్వహిస్తున్నాం. మలుపులో ప్రమాదాలు జరగకుండా అవసరమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

-ప్రమీల, ఆర్అండ్‌బీ జేఈ, కురుపాం డివిజన్

మధ్యవర్తిత్వానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ పరిధిలో మధ్య వర్తిత్వం వహించడానికి ఆసక్తి ఉన్న వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విజయనగరం జిల్లా కార్యదర్శి సివిల్ న్యాయాధికారి కె.విజయ కళ్యాణి ఒక ప్రకటనలో కోరారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల25లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. విశ్రాంత న్యాయాధికారులు, బ్యూరో క్రాట్లు, న్యాయ వాదులు, ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

దుర్గా మహాపీఠంలో పూజలు

నెల్లిమర్ల, మే 18: నగర పంచాయితీలోని థామస్‌పేట దుర్గా మహాపీఠంలో ఈ నెల 24న ఉదయం నుంచి 25వ తేదీ ఉదయం వరకు 24 గంటల ప్రత్యేక దీక్షగా అహోరాత్ర నరఘోష నివారణ నవ గ్రహ సహిత మహా మృత్యుంజయ శాంతి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్న స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 24న శుక్రవారం ఉదయం 6 గంటలకు యజ్ఞశాల ప్రవేశం, మహా సంకల్పం అనుష్టానం, 9 గంటలకు అగ్ని మథనం, యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జనసేన మరింత బలోపేతం

పాలకొండ: అందరి అండదండలతో జనసేన పార్టీని పాలకొండ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన పార్టీ సభ్యులకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణను గెలిపించుకొని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కు బహుమతిగా ఇవ్వాలనే ఉద్దేశంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

చిత్రలేఖనంలో శిక్షణ

పాలకొండ: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం శనివారం కొనసాగించారు. డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి పిల్లలకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. అతనితో పాటు విశ్రాంత అధ్యాపకుడు మండల వెంకట రమణ పిల్లలకు చిన్న కథలు చెప్పారు. గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీనివాసునికి హారతులు ఇస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్, మే 18: పట్టణ ప్రజల ఇలవేల్పు శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం, బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 7 గంటలకు పట్టణ గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య అంకురార్పరణ చేశారు. ఆదివారం సుప్రభాత సేవ, మండపారాధనలతో పాటు శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న శేష వాహనం, 21న గజవాహనం, 22న గరుడ వాహన సేవలు నిర్వహించనున్నట్టు ఈవో చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



రాజారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ఈ నెల 13న పోలింగ్ రోజున బిడ్డిక రాజారావు అనే హిక్రా పెద్దఖర్జ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు వేసి బయటకు వచ్చి గుండెపోటుతో రోడ్డుపై పడి చనిపోయారు. విషయం తెలుసుకున్న కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి శనివారం రాజారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు కూటమి నాయకులు కత్రిక మల్లేష్, మల్లేశ్వరరావు, అడ్డాకుల నరేష్, పోలూరు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మనోహర్, మన్మథరావు, రామారావు పాల్గొన్నారు.

టైలర్లకు ధ్రువపత్రాలు



మాట్లాడుతున్న చంద్రమౌళి, రామకృష్ణ తదితరులు

సీతానగరం, మే 18: సీతానగరం మండలంలోని మహిళా వెల్ఫేర్ సొసైటీలో శనివారం టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వి.చంద్రమౌళి, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల టైలరింగ్ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీతానగరంలో వర్షిత టైలరింగ్ ప్రొడక్షన్ యూనిట్, కురుపాంలో ముత్యాలమ్మ టైలరింగ్ ప్రొడక్షన్ యూనిట్ విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. వీరికి అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని తెలియజేశారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన గొట్టివాడలోని 30 మందికి, సీతానగరంలోని 60 మందికి ధ్రువపత్రాలు అందించారు.

పోలీసులు అప్రమత్తం

- ఎన్నికల సంఘం కన్నెర్రతో జాగ్రత్తలు
- ఓట్ల లెక్కింపు తరువాత అల్లర్లు జరిగే అవకాశాలపై ఆరా
- గ్రామాలు, వ్యక్తుల వారీగా వివరాల సేకరణ

సాలూరు రూరల్, మే 18: తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎన్నికల అనంతరం జరిగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్రజేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులతో ఈ నెల 16న విజయనగరంలో సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు తరువాత ఎటువంటి హింస జరగకుండా పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో నిఘాను ఎస్పీలు పటిష్టం చేశారు. ఇన్‌ఫార్మర్ల ద్వారా గ్రామాల్లో పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాల ఆధారంగా జిల్లాలో ఏయే సర్కిళ్లలో అలర్లు జరిగే అవకాశాలు ఉంటాయోనని అంచనా వేస్తున్నారు. అల్లర్లకు ప్రేరేపించగల వ్యక్తులను గుర్తిస్తున్నారు. మున్సిపాలిటీల్లో వార్డులు, గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఓట్ల లెక్కింపు వరకు పట్టణాలు, గ్రామాల్లో ఎటువంటి శుభాశుభకార్యాలను నిర్వహించినా పోలీసుల అనుమతి తీసుకోవాలని ప్రకటించారు. మున్సిపాలిటీల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. గ్రామాల్లో నిఘాను పెంచారు. సాలూరులో శనివారం అర్బన్ సీఐ వాసునాయుడు ఈ విషయాలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించారు. సాలూరు సర్కిల్‌లో వివిధ గ్రామాల సమాచారం రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్.ఐ.లు వెంకటరమణ, పొదిలాపు నారాయణరావు, నరసింహమూర్తి సేకరించారు.



సాలూరులో శనివారం సాయంత్రం అవగాహన కల్పిస్తున్న అర్బన్ సీఐ వాసునాయుడు



తాటిమానుగూడలో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

దోమల నివారణ మందు పిచికారీ

భామిని: దోమల నివారణకు ఇంటి లోపలే మందును పిచికారీ చేయించాలని మలేరియా యూనిట్ ఆఫీసర్ అప్పారావు గ్రామస్తులకు సూచించారు. శనివారం తాటిమానుగూడ, ఇసుకగూడలలో మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కృష్ణారావు, ఎంపిహెచ్‌ఈవో పద్మరాజుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సీతానగరం, మే 18: ఎన్నికల కౌంటింగ్ వరకు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేస్తున్నట్లు పార్వతీపురం గ్రామీణ సీఐ రవికుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక హనుమాన్ కూడలి వద్ద వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగనున్నందున అంతవరకు మండల ప్రజలు సంయమనం పాటించాలని సీఐ రవికుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని అంటిపేట తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద నాయకులు, ప్రజలతో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రవికుమార్

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నెల్లిమర్ల, మే 18: అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ సుధారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. తాగునీరు, వైద్యం, మురుగు నీటి వ్యవస్థ తదితర అంశాలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఈవో పీఆర్‌డీ కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ధాన్యం మండీ ప్రారంభం

ఒడిశా

రాయగడ: రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కోసం ఆర్ఎంసీఎస్ కార్యాలయ ఆవరణలో మండీ ప్రారంభమైంది. రబీ సీజన్‌లో ధాన్యం విక్రయించేందుకు 237 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బషరత్ సోరేన్, సహాయ అధికారి మన్మత్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం ధర మొదటి రకానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు సోమ, శుక్రవారాల్లో మండీలో ధాన్యం అమ్ముకోవచ్చని వారు తెలిపారు.

పార్వతీపురంలో భారీ వర్షం

పార్వతీపురం టౌన్, మే 18: పార్వతీపురం పట్టణంలో శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. మండు వేసవిలో సుమారు రెండు గంటలకుపైగా వర్షం కురవడంతో ప్రజలు ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందారు. పట్టణ ప్రధాన రహదారిలో వరద నీరు చేరడంతో పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది.



పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

మామిడి పంటకు నష్టం

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఉదయం ఎండ తీవ్రంగా ఉంది. సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరి కొద్దిరోజుల్లోనే మామిడి పంటను దించేందుకు యజమానులు సిద్ధమవుతున్న తరుణంలో ఈదురుగాలులతో నష్టపోయారు.



మక్కువలో కురుస్తున్న వర్షం

మక్కువలో...

మక్కువ: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఉదయం పూట ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడిన ప్రజలు... వర్షంతో ఉపశమనం పొందారు. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత రెండు రోజులుగా ఉదయం ఎండ, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షంతో భిన్న వాతావరణం నెలకొంది.

వేసవి శిబిరాలకు స్పందన

గరుగుబిల్లి, మే 18: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు స్పందన లభిస్తోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు శనివారం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. క్విజ్ పోటీలతో పాటు పుస్తక పఠనం, పద్యాలు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే బోధన అందిస్తున్నామన్నారు.



గరుగుబిల్లిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



సంతోషపురం సమీప పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సంతోషపురంలోనే ఏనుగుల తిష్ఠ

గరుగుబిల్లి, మే 18: మండలంలోని సంతోషపురంలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. శుక్రవారం చేరుకున్న ఏనుగుల గుంపు శనివారం పరిసర పంట పొలాల్లోనే సంచరిస్తున్నాయి. నాగావళి నదికి ఆనుకుని గ్రామం ఉండటంతో అరటి, పామాయిల్, వరి, తదితర పంటలు ఎక్కువగా ఉన్నాయి. ఏనుగుల గుంపు సంచరించడంతో అటువైపుగా రైతులు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. చేతికి అందివచ్చిన పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నది మార్గం గుండా సుంకి వైపు తరలించేందుకు అటవీ శాఖ సిబ్బంది అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఏనుగుల గుంపు సంచరించే ప్రాంతంలో ప్రజలు కవ్వింపు చర్యలకు పాల్పడరాదని సిబ్బంది కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఏనుగుల గుంపు సంచరిస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నారు. ఒకవైపు ఉక్క పోత, మరోవైపు ఏనుగుల బెడదతో వివిధ గ్రామాల ప్రజలు సతమతమవుతున్నారు. సంబంధిత సిబ్బంది ఏనుగుల గుంపును శాశ్వతంగా ఈ ప్రాంతం నుంచి తరలించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.